సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 30 । మే । 2025



రికవరీ ఎందుకు చేయలేదు?
నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు.
- 8లో ▸



పట్టింపేది?
ఆర్టీసీ బస్టాండ్లలో కనీస వసతులు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.4 /23.9
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

యూరియా తక్కువ మోతాదులో వాడాలి

సదాశివనగర్ : పంటల సాగులో తక్కువ మోతాదులోనే యూరియా వాడాలని ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి సూచించారు. గురువారం అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ భాస్వరం ఎరువులను దుక్కిలో మాత్రమే వాడాలన్నారు. అవసరం మేరకు మాత్రమే రసాయన ఎరువులను వినియోగించాలని సూచించారు. అధికారులు సిఫారసు చేస్తేనే పురుగు మందులను స్ప్రే చేయాలన్నారు. పంట మార్పిడి ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమం కోఆర్డినేటర్ రేవంత్, ఏడీఏ రత్న, ఏవో ప్రజాపతి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన



కామారెడ్డి అర్బన్: ఎవరైనా రెండు వారాల కన్నా ఎక్కువగా దగ్గు, జ్వరం, ఛాతినొప్పిలతో బాధపడడం, తెమడలో రక్తం వస్తే క్షయ వ్యాధి (టీబీ)గా అనుమానించాలని జిల్లా కార్మిక సహాయ కమిషనర్ కోటేశ్వర్లు పేర్కొన్నారు. టీబీ వ్యాధి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం కామారెడ్డి పట్టణంలోని బీడీ ప్యాకింగ్ కార్మికులు, మునీమ్‌లకు అవగాహన కల్పించారు. సమావేశంలో కోటేశ్వర్లు మాట్లాడుతూ టీబీ లక్షణాలున్నవారు ఆశ వర్కర్లను సంప్రదిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా టీబీ పరీక్షలు చేయడంతో పాటు వ్యాధి నిర్ధారణ తర్వాత ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ విషయాన్ని బీడీ కార్మికులకు బీడీ మునీమ్‌లు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆశ వర్కర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



కామారెడ్డి క్రైం : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. కామారెడ్డి డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న హిందు, ముస్లిం మత పెద్దలతో గురువారం జిల్లా కేంద్రంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, వివిధ సంఘాల ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలో షబ్బీర్‌కు చోటు


సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) రాజకీయ వ్యవహారాల కమిటీని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం గురువారం ప్రకటించింది. కామారెడ్డి జిల్లా నుంచి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఈ కమిటీలో చోటు కల్పించారు.

పారితోషికం చెల్లించాలి

కామారెడ్డి అర్బన్ : గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వెంటనే పారితోషికం చెల్లించాలని ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ కుమార్ గౌడ్, రాజేష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా ప్రణాళిక అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇతర జిల్లాల్లో పారితోషికం చెల్లించారని, కామారెడ్డి జిల్లాలోనూ చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

పంటలకు మద్దతు..!

- ఎంఎస్‌పీ పెంచిన కేంద్ర ప్రభుత్వం
- పత్తి క్వింటాలుకు రూ. 589 పెంపు
- సోయా, కంది పంటలకూ గణనీయంగా పెరిగిన ధర



కేంద్ర ప్రభుత్వం 2025–26 వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట ఉత్పత్తులకు ఎంఎస్‌పీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పత్తికి ఏకంగా క్వింటాలుకు రూ. 589 చొప్పున పెంచింది. కంది, సోయా, జొన్న, మక్కల కనీస మద్దతు ధర కూడా గణనీయంగా పెరిగింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.24 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవనుంది. ఆ తర్వాత సోయా, మక్క, పత్తి, కంది తదితర పంటలు సాగవుతాయని అంచనా. కేంద్ర ప్రభుత్వం పంట ఉత్పత్తుల ఎంఎస్‌పీ(మినిమం సపోర్ట్ ప్రైస్)ని సవరిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆయా పంటలు పండించే వారికి కొంత మేలు చేకూరుతుందని భావిస్తున్నారు.

వరికి అరకొరే..

జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుంది. ఈసారి ఖరీఫ్‌లో 3.18 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాలుకు రూ. 69 మాత్రమే కనీస మద్దతు ధర పెంచింది. ప్రస్తుతం మేలురకం వరి ధాన్యం ధర క్వింటాలుకు రూ. 2,320 ఉండగా.. పెరిగిన ధరతో రూ. 2,389 కి చేరనుంది. ఈ ధర ఏమాత్రం సరిపోదని రైతులు అంటున్నారు. వరి సాగుకు అయ్యే ఖర్చు భారీగా పెరిగిందని పేర్కొంటున్నారు. సాగు వ్యయానికి అనుగుణంగా మద్దతు ధర పెరగకపోవడంపై నిరాశ చెందారు.

ఇతర పంటలకు..

జిల్లాలో పప్పుదినుసులూ ఎక్కువ విస్తీర్ణంలోనే సాగవుతాయి. వరి తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో సోయా వేస్తారు. ఈ ఖరీఫ్‌లో 84,220 ఎకరాలలో సోయా సాగవుతుందని అంచనా.. ఈ పంటకు కేంద్రం క్వింటాలుకు రూ. 436 ఎంఎస్‌పీ పెంచింది. కందులకు క్వింటాలుకు రూ. 450, మినుములకు రూ. 400, పెసర్లకు రూ. 86 ధర పెరిగింది. రాగులకు రూ. 596, మొక్కజొన్నకు రూ. 175, జొన్నకు రూ. 328, సజ్జకు రూ. 150 పెంచింది.

జిల్లాలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్ద కొడప్‌గల్ మండలాల్లో పప్పుదినుసులు ఎక్కువగా సాగు చేస్తారు. గాంధారి, మాచారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్, రామారెడ్డి, భిక్కనూరు, రాజంపేట, లింగంపేట, తదితర మండలాల్లో మక్క ఎక్కువగా సాగవుతుంది.

మెట్ట ప్రాంతంలో..

మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, గాంధారి, లింగంపేట, రాజంపేట, తాడ్వాయి, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, భిక్కనూరు, దోమకొండ, పాల్వంచ తదితర మండలాల్లో పత్తి పంట ఎక్కువగా సాగవుతుంది. కొన్నిచోట్ల పత్తి పంటనే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. నల్లరేగడి భూముల్లో, వర్షాధారంగా చాలామంది పత్తి సాగు చేస్తుంటారు. కొన్నిచోట్ల బావులు, బోర్ల ద్వారా డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకుని కూడా పత్తి పంట వేస్తారు. కాగా ఈ పంటకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు తరచూ మందులు పిచికారీ చేయడం, కలుపు నివారణ చర్యలు తీసుకోవడం వంటివి చేస్తుంటారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిసి పంటకు నష్టం వాటిల్లుతోంది. పత్తి సాగుకు అయ్యే ఖర్చు కూడా పెరిగి కొంత మంది పత్తి సాగు నుంచి దూరమయ్యారు. అయితే పెరిగిన మద్దతు ధరతో మళ్లీ రైతులు పత్తి సాగువైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయి.

పత్తి సాగు పెరిగే అవకాశం..

జిల్లాలో గతేడాది వానాకాలం సీజన్‌లో 34 వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. ఈ ఏడాది కూడా 34,459 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే వేసవి దుక్కులు సిద్ధం చేసి ఉంచిన రైతులు వర్షాలు కురుస్తుండడంతో విత్తనాలు వేసేందుకు రెడీ అవుతున్నారు. పత్తి విత్తనాలు కొనుగోలు చేసి ఉంచిన రైతులు విత్తనం వేయనున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను భారీగా పెంచింది. గతేడాది మేలు రకం పత్తి క్వింటాలు ధర రూ. 7,521 ఉండగా.. కేంద్రం పెంచిన రూ. 589 కలుపుకుని ఈసారి రూ. 8,110 కి చేరింది. మీడియం రకం పత్తి క్వింటాలు ధర రూ. 7,121 ఉండగా.. రూ. 589 పెంపుతో రూ. 7,710 కి చేరనుంది.

‘జీలుగ’ కోసం బారులు



తాడ్వాయిలో క్యూలో ఉన్న రైతులు

- అరగంటలోనే ఖాళీ అయిన విత్తనాలు
- నిరాశలో పలువురు రైతులు

భిక్కనూరు: భూసారం పెంచడానికి ఉపయోగపడే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలకు జిల్లాలో కొరత ఉంది. అరొకరగానే సరఫరా అవుతుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు రామేశ్వరపల్లి, జంగంపల్లి గ్రామాల్లోని సింగిల్‌విండోల్లో విత్తనాలు విక్రయిస్తున్నారని తెలియగానే రైతులు పరుగులు తీశారు. అరగంటలోనే విత్తనాల స్టాక్ పూర్తవడంతో ఆయా విండోల్లో నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. అవసరమైన జీలుగ విత్తనాలను తెప్పిస్తామని విండో చైర్మన్లు గంగ్ల భూమయ్య, నాగార్తి భూంరెడ్డి, గొండ్ల సిద్ధరాములు తెలిపారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తారని తెలియగానే రైతులు ఉదయం 6 గంటలకే తరలివచ్చారు. అధికారులు వచ్చి వరుసగా రైతులకు విత్తనాలు అందించారు. అయితే సగం మందికి కూడా విత్తనాలు సరిపోలేదు. దీంతో రైతులు నిరాశ చెందారు. రైతులకు సరిపడా విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏవో నర్సింలు మాట్లాడుతూ మండలానికి 220 సంచులు మాత్రమే వచ్చాయన్నారు. మరిన్ని విత్తనాల కోసం పైఅధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

భద్రతా భావాన్ని పెంపొందించాలి

- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- పోలీసు అధికారులతో సమీక్షలో డీజీపీ జితేందర్

కామారెడ్డి క్రైం: ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని డీజీపీ జితేందర్ సూచించారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ రాజేశ్ చంద్ర పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కార్యాలయ ఆవరణలో డీజీపీ మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల నిర్వహణ, ప్రాధాన్యమైన కేసులు, నేరాల పరిశోధన, ప్రజలకు అందిస్తున్న సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తాము సురక్షితంగా ఉన్నామన్న భావన ప్రజల్లో కలిగేలా పోలీసింగ్ ఉండాలన్నారు. ప్రతి కేసులో సమర్థవంతమైన, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నప్పుడే ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించవచ్చన్నారు. సాంకేతికత ఉపయోగంలో దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ ప్రథమ స్థానంలో ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హైవే అథారిటీ, రవాణా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించడం, బాధితులకు అండగా నిలవడం, నేరస్తులకు శిక్ష పడేలా కేసుల విచారణ జరిపించడం తదితర అంశాల్లో జిల్లా అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. సమీక్షలో మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, నిజామాబాద్ సీపీ సాయి చైతన్య, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, పక్కన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ రాజేశ్ చంద్ర

సిబ్బందికి అభినందన

కామారెడ్డి క్రైం: ఇటీవల డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించిన బ్లూకోల్ట్, పెట్రో కార్ పోలీసులను డీజీపీ అభినందించారు. బాన్సువాడ ఎస్సై తాజుద్దీన్, బాన్సువాడ కానిస్టేబుల్ శంకర్, పిట్లం కానిస్టేబుల్ రవిచంద్ర, పిట్లం హోంగార్డ్ మారుతిలను అభినందించి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందించారు.



సిబ్బందికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న డీజీపీ

సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

- కాళేశ్వరం ప్యాకేజీని పూర్తి చేస్తాం
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


కామారెడ్డి టౌన్: గత ప్రభుత్వ పథకాలతో పాటు కాంగ్రెస్ హామీ ఇచ్చిన పథకాలను సైతం ఆపకుండా అమలు చేస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కింగ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ 70 నుంచి 80 శాతం సీట్లు సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. దీనికి సంబంధించిన భూసేకరణ నిధుల కోసం షబ్బీర్ అలీ ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిశారన్నారు.

ప్రొటోకాల్ పేరిట అభివృద్ధిని అడ్డుకోవద్దు..

ప్రొటోకాల్ పేరిట నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కామారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా కామారెడ్డిని అభివృద్ధి చేయడం మాత్రం ఆపనన్నారు. గత ప్రభుత్వం పంటల నష్ట పరిహారం కోసం ఒక్క రూపాయి మంజూరు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం జిల్లాకు రూ. 74 లక్షలు విడుదల చేసిందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పార్టీ జిల్లా పరిశీలకులు సత్యనారాయణగౌడ్, వేణుగోపాల్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు ఎడ్ల రాజిరెడ్డి, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, పండ్ల రాజు, గోనె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఇబ్బందులున్నా..

బాన్సువాడ : ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. గురువారం బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా ఒక్క బాన్సువాడలోనే 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. పిల్లలు పక్కదారి పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. దయ్యాలను పెంచి పోషించిన బీఆర్ఎస్ అధినేత దేవుడెట్ల అవుతాడని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. దయ్యాలకు నాయకత్వం వహించినప్పుడు దయ్యాల నాయకుడే అవుతాడని పేర్కొన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో ఇందిరమ్మ లబ్ధిదారులతో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే పోచారం

‘సాక్షి’ కథనంపై చర్చ

కామారెడ్డి టౌన్ : జిల్లాకేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ‘సాక్షి’ కథనం హాట్ టాపిక్‌గా మారింది. ‘సాక్షి’లో గురువారం ప్రచురితమైన ‘రేవంతన్నా... కామారెడ్డి వైపు సూడన్నా’ కథనంపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈ కథనాన్ని ప్రస్తావించి, చాలా బాగా రాశారంటూ ప్రశంసించారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి వేసిన ఓట్లను గుర్తు చేశారు. సీఎంను ఇక్కడి ఓటర్లు గెలిపించి ఉంటే ఇప్పటికే ఎంతో అభివృద్ధి అయి ఉండేదన్నారు. కానీ ఇక్కడి ప్రజలు గెలిపించిన ఎమ్మెల్యే మాత్రం ఇద్దరు సీఎంలను ఓడించానని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డిని ఇక్కడి ప్రజలు ఓడించినా ఆయన ప్రాణహిత –చేవెళ్లకు రూ. 23.14 కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు. కామారెడ్డిని త్వరలోనే ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. సాక్షి కథనంలో వచ్చిన సమస్యలపైన షబ్బీర్ అలీ సమాధానాలు ఇచ్చారు. పట్టణంలో తాగు నీరు, ఇరుకు రోడ్లు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మరింత ఈజీగా రిజిస్ట్రేషన్లు


- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్
- జూన్ 2 నుంచి అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

సుభాష్‌నగర్: రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభం కానుంది. గంటల తరబడి కార్యాలయాల్లో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, భీమ్‌గల్, ఎల్లారెడ్డి, దోమకొండ, బాన్సువాడ, బిచ్కుందలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లపై అమ్మిన, కొన్నవారితోపాటు సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. దీనికి ఎక్కువ సమయం పడుతుండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సర్కారు సంకల్పించింది. ఇందుకోసం ఆధార్–ఈ సంతకం అమలు చేసేందుకు కూడా సిద్ధమవుతోంది. తద్వారా జాప్యం లేకుండా ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయొచ్చని భావిస్తోంది.

సేవల్లో పారదర్శకత

రిజిస్ట్రేషన్ సేవలు వేగంగా, పారదర్శకంగా అందించాలని స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్ట్ కింద ఏప్రిల్ 10 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తీసుకొచ్చింది. అక్కడ విజయవంతం కావడంతో జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోంది. ఇకపై 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది.



జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానంపై కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఒక్కో సబ్‌రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ద్వారా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆర్మూర్‌లో ఈ విధానం విజయవంతమైంది. స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకు ఒక సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లుగా నిర్ణయించారు. ఉదయం 24 స్లాట్లు, మధ్యాహ్నం 24 డాక్యుమెంట్లు చేసేలా విభజించారు. రిజిస్ట్రేషన్ కోసం ముందుగా registration.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. తద్వారా ప్రజలు కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా నిర్దేశిత సమయంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. ఆలస్యమైతే మాత్రం మరుసటి రోజు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమైన, అత్యవసర సమయంలో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఐదు డాక్యుమెంట్లను స్లాట్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

స్లాట్ బుకింగ్ లేకుంటే రిజిస్ట్రేషన్ చేయం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్లాట్ బుకింగ్ విధానంతో జూన్ 2 నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమల్జేస్తాం. ఆర్మూర్‌లో స్లాట్ బుకింగ్ విధానం విజయవంతంగా కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారానే అనుమతిస్తాం. స్లాట్ బుకింగ్ లేకుండా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయబోం. ప్రజలు గమనించి సహకరించాలి.

– ప్రసూన, రిజిస్ట్రార్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

క్లుప్తంగా

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన జిల్లావాసి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ డైరెక్టర్ జ్యోత్స్న నేపాల్ మార్గంగా ఎవరెస్ట్ బేస్ క్యాంప్(5,364 మీటర్ల ఎత్తు) అధిరోహించారు. త్రివర్ణ పతాకంతో పాటు పాఠశాల బ్యానర్‌ను ప్రదర్శించారు. జ్యోత్స్న ఎవరెస్ట్‌ను అధిరోహించడం తమ పాఠశాలకు గర్వకారణమని ఆ స్కూల్ యాజమాన్యం పేర్కొంది.

విద్యార్థి సంఘాల ఆందోళన



ప్రిన్సిపల్ చాంబర్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: అనుమతి లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని ఓ స్కూల్‌లో విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్‌కు అనుమతి లేదని డీఈవో ఉత్తర్వులు జారీ చేసినా స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫాం, అడ్మిషన్ల పేరిట ఫీజులు వసూళ్లు చేస్తున్నారని తక్షణమే స్కూల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు విఠల్, ముదాం అరుణ్‌కుమార్, బుల్లెట్, స్టాలిన్, మణికంఠ, రాహుల్, హరి, శివకృష్ణ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో పూజలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని పశ్చిమ హౌసింగ్‌బోర్డు కాలనీలోని సంకష్టహర గణపతి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో సామూహిక కల్యాణ తిలక ఉత్సవం నిర్వహించారు. పెళ్లి కాని, వివాహ ప్రయత్నం చేస్తున్న యువతీ, యువకులు సుమారు 105 మంది కల్యాణ తిలకం ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వేదపండితుడు జి ఆంజనేయశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు సుతారి అంజయ్య, రవీందర్‌గౌడ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో పోలీసుల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో గురువారం రాత్రి నిషేధిత మాదక ద్రవ్యాలపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులను, హోటళ్లు, పాన్ షాపులతోపాటు పలు దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు స్నిపర్ డాగ్‌లతో తనిఖీలు చేశారు. నిషేధిత మత్తు పదార్థాలు వాడితే చర్యలు తప్పవన్నారు.

రికవరీ ఎందుకు చేయలేదు?



మాట్లాడుతున్న కృష్ణారావు, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, మదన్‌మోహన్‌రావు, భూపతిరెడ్డి, కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, రాజీవ్‌గాంధీ హనుమంతు

- సీఎంఆర్ రాబట్టే విషయంలో చర్యలు తీసుకోలేదెందుకు?
- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి జిల్లాలో డిఫాల్ట్ రైస్‌మిల్లర్ల నుంచి సీఎంఆర్ రికవరీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎక్సైజ్, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, భూభారతి, వానాకాలం సాగు ప్రణాళిక అంశాలపై సమీక్షించారు. ఈ సీజన్‌లో నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం సేకరించిన విషయమై అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

రికవరీ రూ. 4.4 కోట్లేనా?

కామారెడ్డి జిల్లాలో 49 మంది డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ.45 కోట్లు రికవరీ కావాల్సి ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. రూ. 4.4 కోట్లు మాత్రమే రికవరీ చేయడమేమిటని, మిగిలిన మొత్తం రికవరీ కోసం చర్యలు తీసుకోవాలని జూపల్లి ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రతి 15 రోజులకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ఫలితం సాధించాలన్నారు. కామారెడ్డి జిల్లాలో 426 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.77 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివరించారు. 116 మిల్లులకు ధాన్యం నిల్వలను కేటాయించామని, రైతులకు రూ.822 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు జరిపామని పేర్కొన్నారు. గతేడాదికంటే ఈసారి యాసంగిలో 30 శాతం అధికంగా ధాన్యం సేకరించామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 నెలల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులోకి తెచ్చామని మంత్రి జూపల్లి అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, నిరుద్యోగ యువతకు బాసటగా నిలువాలని, ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని ఇప్పటికే పైలట్ మండలాల్లో అమలు చేశామని, జూన్ 3 నుంచి అన్ని మండలాల్లో విజయవంతంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణ ప్రాంగణాలపై పట్టింపేది..?



కనీస వసతులు లేని నస్రుల్లాబాద్ బస్టాండ్

- అసౌకర్యాల నడుమ బస్టాండ్లు
- కనీస వసతుల కల్పనలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

నస్రుల్లాబాద్: ఆర్టీసీ అధికారుల తీరుతో ప్రయాణ ప్రాంగణాలపై పట్టింపు లేకుండా పోయింది. ఉచిత బస్సు సౌకర్యం అమలులో ఉండటంతో బస్సుల్లో ప్రయాణించే జనం సంఖ్య పెరిగింది. దీంతో బస్సు వచ్చే వరకు బస్టాండుల్లో వేచి చూడాల్సి వస్తోంది. కానీ బస్టాండ్‌లో మాత్రం కనీస వసతులు కల్పించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండుల్లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులుఅసహనంవ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లు గడిచినా వసతులు కరువు

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు బస్సులు వెళ్తుంటాయి. అంతే కాకుండా నస్రుల్లాబాద్ చుట్టూ ఉన్న గ్రామాల్లో సెటిలర్లు ఎక్కువగా ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు సైతం ప్రజలు వెళ్తుంటారు. అర్ధరాత్రుళ్లు కూడా బస్టాండ్‌లో ప్రజలు లేట్ నైట్ బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు కానీ ఇక్కడ మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించడంలో మాత్రం ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నెమ్లి గ్రామానికి చెందిన దాతలు బస్టాండ్ ప్రాంగణం నిర్మించి ఇచ్చారు. కానీ కనీస వసతులు లేక నిరుపయోగంగా మారింది. కామిశెట్టిపల్లి, అంకోల్ వంటి గ్రామాల్లో కూడా ప్రయాణ ప్రాంగణాల వైపు అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో నిరుపయోగంగా మారాయి.

అద్దెలు సరే.. అవసరాల మాటేమిటి

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యాపారాలు చేయాలంటే టెండర్ వేసి అద్దెలు వసూలు చేస్తారు. ఇదే తరహాలో నస్రుల్లాబాద్ బస్టాండ్‌లో కూడా ఏళ్లుగా వ్యాపార సముదాయాలకు అద్దెలు వసూలు చేస్తున్నారు. వీటితో ఆర్టీసీ లాభాలు పొందుతుందే కానీ ప్రయాణికుల అవసరాలను తీర్చడంలో శ్రద్ధ వహించడం లేదు. ఇకనైనా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



నస్రుల్లాబాద్ బస్టాండ్ నుంచి వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. కానీ అత్యవసర పరిస్థితిలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. అర్ధరాత్రి ప్రయాణించే సమయంలో తాగునీరు లేక ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి.

– సాయి కుమార్, నస్రుల్లాబాద్

అవస్థలు పడుతున్నాం



మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారి పరిస్థితి దారుణంగా మారింది. బస్టాండ్ శుభ్రంగా లేక పోవడం, కూర్చోవడానికి సైతం వీలు లేకుండా పోయింది. బస్సు కోసం ఎదురు చూసే సమయంలో అత్యవసరాలు తీర్చుకోవాలంటే అవస్థలు పడుతున్నాం.

– అల్లం రాములు, మైలారం

90 శాతం సబ్సిడీతో మగ్గాల ఏర్పాటు



సబ్సిడీ చెక్కులు అందుకుంటున్న మహిళలు

దోమకొండ: దోమకొండ మండల కేంద్రానికి చెందిన ఆరుగురికి 90 శాతం సబ్సిడీతో మగ్గాలు అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన చేనేత సేవ సొసైటీ ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని దోమకొండ గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తెలిపారు. మండల కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో స్థానిక చేనేత కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చేనెలాఖరుకల్లా ఈ మగ్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కార్మికులకు ఆర్థిక భద్రత, సహాయం అందించేందుకు థ్రిఫ్ట్ ఫండ్ పేరుతో సామాజిక సంక్షేమ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నిధిని విద్య, వైద్య ఖర్చులు, వివాహం లేదా ఇంటి నిర్మాణం వంటి అవసరాలను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

మద్నూర్: మండలంలోని కొడిచిరలో డాక్టర్ కేవీ రెడ్డి మెమోరియల్ లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 మంది కంటి పరీక్షలు నిర్వహించుకోగా 18 మందికి మోతిబిందు ఉన్నట్లు వైద్యుడు అజయ్ తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి హన్మంత్‌రావు, సిబ్బంది రఫిక్, జీపీ కార్యదర్శి రాజు,ఆశావర్కర్ రుక్మిణి,గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యుడు లింబాద్రి పిల్లలకు కంటి పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరీశ్‌గౌడ్, స్వప్న, లింబాద్రి, నీరజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పప్పు, నూనె గింజ పంటలతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయ్ కుమార్

రుద్రూర్ : పప్పు ధాన్యాలు, నూ నె గింజ పంటల సాగుతో అధిక లాభాలను ఆర్జించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ సూచించారు. పోతంగల్ మండలం హెగ్డోలిలో గురువారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి, సోయా, మొక్కజొన్న పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విధానాలను వివరించారు. ఒకే రకమైన పంట వేయడంతో భూములు చౌడు బారిపోతున్నాయని, దీని నివారణకు పంట మార్పిడి చేయాలన్నారు. తక్కువ కాల పరిమితి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ సమాచార సాధనాలపై విస్తరణ శాస్త్రవేత్త శ్వేత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి నిశిత, వెటర్నరీ డాక్టర్ సురేశ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ ఎంపీపీ పుప్పాల శంకర్, రైతులు పాల్గొన్నారు.

డీపీఎంల నుంచి షురూ..

● బదిలీకు ఆప్షన్లు ఇచ్చిన సెర్ప్

డొంకేశ్వర్(ఆర్మూర్): ఐకేపీలో ఉద్యోగ బదిలీల ప్రక్రియ మొదలైంది. డీపీఎంల నుంచి బదిలీలను మొదలు పెట్టిన రాష్ట్ర సెర్ప్ శాఖ వారికి ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. జిల్లాలో ఆరుగురు డీపీఎంలతోపాటు ఒక ఏపీడీ ఉన్నారు. వీరందరినీ బదిలీ చేసేందుకు ఆప్షన్ ఫారాలను ఇచ్చింది. వీటిని నింపిన డీపీఎంలు, ఏపీడీ సెర్ప్ శాఖకు హార్డ్ కాపీని అందజేయగా ఆన్‌లైన్‌లో కూడా ఆప్షన్లు పెట్టుకున్నారు. రెండు, మూడు రోజుల్లో సెర్ప్ సీఈవో వీరికి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనున్నారు. అయితే, డీపీఎంల బదిలీలు పూర్తయిన వెంటనే ఏపీఎంలు, సీసీలకు కూడా బదిలీలకు ఆప్షన్లు ఇవ్వనున్నారు. వీరికి జిల్లా స్థాయిలోనే డీఆర్‌డీవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరుగుతుంది.

గిట్టుబాటు ధర కల్పించేందుకే ఎంఎస్‌పీ పెంపు

సుభాష్‌నగర్: వానాకాలం సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలపడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఎంఎస్‌పీ పెంచిందని తెలిపారు. 2014 సంవత్సరంలో వరి మద్దతు ధర రూ.1360 ఉండగా, 2025నాటికి రూ.2369కి కేంద్ర ప్రభుత్వం పెంచిందని గుర్తుచేశారు. రైతులకు వడ్డీ రాయితీ కోసం రూ.15,642 కోట్లు విడుదల చేసిందని, 11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీ భారీగా పెంచిందని, ఎంఎస్‌పీ కోసం రూ.2.70లక్షల కోట్లు కేంద్రం కేటాయించిందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. కనీస మద్దతు ధర పెంచిన ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి జిల్లా రైతాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు.

చెరువు శిఖం భూమి కబ్జా

- పది ఎకరాల్లో ప్లాట్ల దందా
- కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం



పట్టా భూమి పక్కనే ఉన్న చెరువు శిఖం భూమి

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సారంగాపూర్ శివారులో చెరువు శిఖం భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ఇటీవల వెలుగు చూసింది. 10 ఎకరాల చెరువు శిఖం భూమిలో ప్లాట్ల దందా ప్రారంభించారు. నిజామాబాద్ – బోధన్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కోట్ల రూపాయల విలువజేసే ఈ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. దీంతో శిఖం భూమి పక్కనే ఉన్న ప్రైవేటు భూమి పట్టాను చూపుతూ కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు తెలిసింది. కాగా, గతంలో చెరువు శిఖం భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తూ బోర్డును పెట్టారు. సర్వే నంబర్ 231లోని సుమారు 10 ఎకరాల 8 గుంటల శిఖం భూమి చుట్టూ కందకాన్ని తవ్వారు. కానీ, ఇటీవల ఓ మాజీ కార్పొరేటర్ కందకాన్ని తొలగించి శిఖం స్థలంలో ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అందులో భాగంగానే శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానిక నాయకులు కొందరు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో రాజేంద్ర కుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి చెరువు శిఖం భూమిని పరిశీలించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



శిఖం భూముల్లో హద్దు రాళ్లు పాతి కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే కబ్జా చేయడం విడ్డూరం. అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలి.

– అక్బర్ నవాజుద్దీన్, సారంగాపూర్

రీ సర్వే చేస్తాం..



సారంగాపూర్‌లోని చెరువు శిఖం భూమి కబ్జాపై ఫిర్యాదులొచ్చాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆ స్థలాన్ని రీసర్వే చేస్తాం. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.

– అనురుద్, తహసీల్దార్

బస్సులను బస్టాండ్‌లోకి తీసుకెళ్లాలి



సదాశివనగర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు తీసుకెళ్లకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంత మంది డ్రైవర్లు బస్సులను బస్టాండ్‌లోపలికి తీసుకెళ్లినా మరికొంత మంది డ్రైవర్లు బస్టాండ్‌లోకి తీసుకెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురు మృతి

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు..

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మండలంలోని మల్లారెడ్డి చెరువులో గురువారం దొండి గంగప్రసాద్(52) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. రోజు మాదిరిగానే ఉదయం 10 గంటలకు టీ స్టాల్ తీసిన గంగప్రసాద్.. 11 గంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్నేపల్లి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేట మండలం మోకన్‌పల్లి గ్రామానికి చెందిన దుబ్బాక నరేశ్(22) మృతి చెందినట్లు ప్రొబెషనరీ ఎస్సై శైలేందర్ తెలిపారు. నరేశ్ జిల్లా కేంద్రంలోని హరిహర ప్లాస్టిక్ దుకాణంలో పనిచేస్తాడు. బుధవారం రోజూ వారీ పనిని ముగించుకొని బైక్‌పై మోకన్‌పల్లికి వెళుతుండగా పాండురంగ రైస్‌మిల్ వద్ద ఉన్న రైల్వేగేట్ ప్రాంతంలో కాలినడకన వెళుతున్న ఖానాపూర్ గ్రామానికి చెందిన రేకులపల్లి నాగభూషణంను ఢీ కొట్టాడు. ప్రమాదంలో నరేశ్ బైక్ పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నాగభూషణంకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్సై తెలిపారు.


డిచ్‌పల్లిలో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డిచ్‌పల్లి : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 60 సంవత్సరాలు) గురువారం ఉదయం మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ కాంపౌండ్ వాల్ లోపల బుధవారం ఉదయం అపస్మారకస్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతు గురువారం ఆ వ్యక్తి మృతి చెందాడు. చామనఛాయ రంగులో ఉన్న మృతుడి ఒంటిపై గోధుమ రంగు ఫుల్ షర్ట్, లేత గోధుమ రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే డిచ్‌పల్లి సీఐ 87126 59851, ఎస్సై 87126 59852 నంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.


అమెరికాలో తిమ్మారెడ్డి యువకుడు అనుమానాస్పద మృతి



గోవర్ధన్ (ఫైల్)

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గోవర్ధన్ (28) అనే యువకుడు గురువారం అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన గూల విఠల్ కుమారుడు గోవర్ధన్ నాలుగు సంవత్సరాల క్రితం అమెరికాలో ఒకాయోలో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. గతేడాది నుంచి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గోవర్ధన్.. బుధవారం కుటుంబసభ్యులతో మాట్లాడాడు. గురువారం గోవర్ధన్ మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గోవర్ధన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహం వచ్చేందుకు నాలుగు రోజులు పట్టే అవకాశం ఉన్నదని స్థానికులు తెలిపారు.

బాలిక అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన బాలిక(15) అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నాందేడ్‌కు చెందిన కామ్రే పూజ తన ఐదుగురు పిల్లలను తీసుకొని నిజామాబాద్‌లోని ఫంక్షన్ హాల్లో పని చేసేందుకు వచ్చింది. బుధవారం రాత్రి 7 గంటలకు నాందేడ్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్ రాగా రైలు దొరకకపోవడంతో భోజనం చేసి రాత్రి 11 గంటలకు పిల్లలతో కలిసి 2వ నంబర్ ప్లాట్ ఫాంపై నిద్రించారు. గురువారం ఉదయం లేచి చూసేసరికి పెద్ద కూతురు కనిపించకపోవడంతో పూజ చుట్టు పక్కల వెతికింది. ఆచూకీ లభించకపోవడంతో రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక ఎవరికైనా కనిపిస్తే 87126 58591 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



లక్ష్మణ్ (ఫైల్)

రెంజల్(బోధన్): మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్(42) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. గత శనివారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన లక్ష్మణ్ భార్యతో ఘర్షణ పడగా, ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన తల్లికి లక్ష్మణ్ మృతదేహం కనిపించింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడిలో ఒకరిపై కేసు నమోదు

నవీపేట : మండలంలోని నాడాపూర్ గ్రామంలో ఇంకుడు గుంత విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ప్రవీణ్ ఇంటి ఎదుట మురికి నీరు చేయడంతో ఇంకుడు గుంత కట్టుకోవాలని పక్కింట్లో ఉండే ఎండల రవీందర్ సూచించాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవీందర్‌పై ప్రవీణ్ కర్రతో దాడి చేయగా చేతికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు రవీందర్ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని మాచాపూర్ శివారులో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. మాచాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 7,400 నగదు, 5 సెల్‌ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిజామాబాద్ రూరల్: నగరంలోని ఒకటో డివిజన్ ఖానాపూర్‌లో చిన్నమోహన్‌కు చెందిన పాడి గేదె గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఖానాపూర్ పరిధిలోని లక్ష్మీస్టోర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురైందన్నారు. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రామడుగులో చోరీ

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరామ శ్రీనివాస్ బుధవారం ఇంటికి తాళాలు వేసి అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి నిజామాబాద్ ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గమనించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న విలువైన వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లేగదూడల పట్టివేత

భిక్కనూరు: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న లేగదూడలను భిక్కనూరు పోలీసులు గురువారం పట్టుకున్నారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో వాహన్నాని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వాహనంలో అనుమతి లేకుండా తరలిస్తున్న 11 మగ లేగదూడలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మహమ్మద్ సమీర్‌ను విచారించగా లేగదూడలను ఆదిలాబాద్ జిల్లాలో కొనుగోలు చేసి సంగారెడ్డి మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పాడన్నారు. లేగ దూడలను కొనుగోలు చేసిన మహారాష్ట్రకు చెందిన వసీంతోపాటు డ్రైవర్ సమీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.